

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం, 9 సెప్టెంబర్ 2025

8 పేజీలు

# రాష్ట్రంలో ఎక్కడ యూరియా కొరత లేదు

## - వైసీపీ నేతల అసత్య ప్రచారం

### - రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**ఏలూరు,ఉమ్మడి ప.గో.జిల్లా సూర్యబ్యూరో :** రాష్ట్రంలో ఎక్కడా కూడా యూరియా కొరత లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జ్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఏలూరులో అధికారులతో ఎరువులు సరఫరా, పంపిణీపై నిర్వహించిన సమీక్షా అనంతరం ఆయన సోమవారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ఏలూరు జిల్లాలో యూరియా సరఫరా, నిల్వలపై వాస్తవాలు తెలుసుకునేందుకు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. అబద్దాలు ప్రచారం చేయడం ద్వారా రైతుల గుండెల్లో అలజడి రేపేందుకు వైఎస్ఆర్ సీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. రైతుల సమస్యను రాజకీయ కోణం నుండి చూస్తూ దుర్మార్గంగా విష ప్రచారాన్ని వైసీపీ నాయకులు చేస్తున్నారన్నారు. నిజంగా రైతులపై వైసీపీ నాయకులకు, జగన్‌కు ప్రేమ అభిమానం ఉంటే వారి హయాంలో కొన్న ధాన్యానికి ఎందుకు సొమ్ము చెల్లించలేదని నిలదీశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తీసుకున్న చొరవవల్ల ప్రతిరోజు రైతాంగానికి భరోసా ఇస్తూ ముందుకు వెళ్లుతున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్‌లో 33,762 మెట్రిక్‌టన్నులకు గాను32,757 మెట్రిక్ టన్నుల సరఫరా చేశామన్నారు. రానున్నరోజుల్లో మరో 2,200 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచి, యూరియా కొరత లేదనే భావనకల్పిస్తున్నామన్నారు. రైతులకు యూరియా పంపిణీకి ఏలూరు జిల్లాలో 530 పంపిణీ కేంద్రాలు

- తరువాయి 2లో..

భారత ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఉక్కు పరిశ్రమదే

# కీలక పాత్ర

- 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యం
- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**న్యూఢిల్లీ/భీమవరం,మేజర్‌న్యూస్ :**ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం సాధనలో ఉక్కుపరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని,2030నాటికి300 మిలియన్ టన్నుల ఉక్కుఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర ఉక్కుభారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో సోమవారం

- తరువాయి 2లో..

వికలాంగత్వం చూసి

# చలించిన జిల్లా కలెక్టర్

### - తక్షణ చర్యలకు ఆదేశాలిచ్చాన చదలవాడ నాగరాణి





**భీమవరం,మేజర్‌న్యూస్ :** పీజిఆర్ఎస్‌లో తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజలతో కలెక్టరేట్ ప్రాంగణమంతా హడావిడిగాఉంది. సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిజిఆర్ఎస్ సమావేశ మందిరానికి వెళ్లే త్రోవలో దివ్యాంగుడైన బొడ్డు రాఘవేంద్ర వీల్ చైర్ లో మెలికలు తిరిగిపోతూ ఉన్న దృశ్యాన్ని చూసి ఒక అడుగు వెనక్కి వేసి వారి వద్దకు వచ్చి ఏమైందని ప్రశ్నించారు.చిన్ననాటి నుండి ఇదే పరిస్థితి అని వీల్‌చైర్‌లో కూడా నిలకడగా కూర్చోపెట్టలేని పరిస్థితిఅని తెలిపారు. ఇటువంటి వ్యక్తిని ఎందుకు ఇలా ఇబ్బంది పడుతూ తీసుకొచ్చారు, మీకున్న సమస్య ఏంటి

- తరువాయి 2లో..

హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు

# కుటుంబానికి స్నేహితుల వితరణ

### - 1993 బ్యాచ్ స్నేహితులచే రూ.1.14 లక్షలు ఆర్థిక సహాయం
### - జిల్లా అసోసియేషన్ తరపున రూ.1లక్ష చెక్కు అందజేత

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** ఇటీవల విధి నిర్వహణలో మృతి చెందిన ఎస్‌బిహెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు బ్యాచ్ మేట్స్, స్నేహితులు ఆ కుటుంబానికి రూ.1.14 లక్షలు ఆర్థిక సహాయం అందించారు.విధినిర్వహణలో మృతిచెంది సుబ్బారావు స్వర్గస్తులైన విషయం విదితమే. ఆ కుటుంబానికి

- తరువాయి 2లో..



అర్జీదారులకు నాణ్యమైన

# పరిష్కారం చూపాలి

### పిజిఆర్ఎస్‌లో 324 అర్జీలు : జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** సంచారజాతులవారి పిల్లలను విద్యకు దూరంచేయవద్దని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తల్లిదండ్రులకు హితవు పలికారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యం.ముక్కంటి, ఆర్డీఓ యం.అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి,అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 324అర్జీలుఅందాయి.ఈ సందర్భంగా సంచార జాతులకు చెందిన పలుకుటుంబాల పిల్లలకు ఆధార్ కల్పించాలని వారిని దత్తత తీసుకున్న వంగాయిగూడెం మున్సిపల్ ఎలిమెంట్రీపాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధనపు శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ వారిని కలిసి సంచార జాతుల పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేయాలనీ కోరారు,దీనిపై జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందిస్తూ ఆ కుటుంబాల వారి సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన ఆదార్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి పిల్లలను పాఠశాలకు పంపాలని

- తరువాయి 2లో..

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు : దళిత నేతలు విమర్శ




నర్సాపురం, మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పాస్టర్లు, దళితులను టార్గెట్ చేసి వ్యూహాత్మకంగా దాడులు చేస్తున్నారని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఈ ప్రభుత్వ అమలు చేస్తుందని దళిత సంఘాల నేతలు విమర్శించారు. సోమవారం కైకులూరు లోని దాన గూడేంలో దళితులు పైన ఆ గ్రామానికి చెందిన అగ్రకులస్తులు దళితులపై కత్తులతో దాడి చెసి గాయపర్చారని,ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో దళితులపై అగ్ర కులస్తులు దాడి చేశారని విమర్శించారు.ఈరెండు ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ సోమవారం నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్య వేదిక అధ్యక్షులు కాకిలేటి ఆనంద్ కుమార్ అధ్యర్యంలో పాస్టర్ రూబేను నివాసం దగ్గర విరాకర్ల సమావేశం ఏర్పాటు చేసి, నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ పాల్గొని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులకు రక్షణలేకుండా పోయింది అని క్రైస్తవుల పైన,చర్చులు పైన, పాస్టర్స్ పైన దాడులు విపరీతంగా పెరిగియాని వీటిని ప్రభుత్వం వెంటనే అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో బి.ఎస్.పి. నాయకలు గూటం జయబాబు, పాస్టర్.వై రూబేను, నేతల రమేష్, దాసరి రాజు,తిరుపతి వెంకటశ్వరావు,తోట నాగేశ్వరావు,తోట చిట్టి బాబు, నల్లి చంద్రశేఖర్,పిల్లి నవరత్నం, కత్తి మండ నాని,వర్ధనపు యేసు రత్నం,నల్లి ప్రసన్న కుమార్, సర్పంచ్ తాడి లక్ష్మణ్రావు, పట్నాల సుబ్బారావు,ఈద జాషువ, ఏలూరి కుమార్ రత్నం, నల్లి రాజు, నల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**మొదటిపేజి తరువాయి**

సూచించారు. పిజిఆర్ఎస్ లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవచూపాలని ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

**-అందిన అర్జీలలో కొన్ని -** శనివారపుపేటకు చెందిన పరసా వెంకటరత్నం అర్జీనిస్తూ తమ ప్రాంతంలో విద్యుత్ వైర్లుకిందకు వ్రేలాడుతూ పిల్లలకు అందేటట్లు ఉన్నాయని వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.చింతలపూడి మండలం ప్రగడవరంకు చెందిన ఎన్. నాగేశ్వరరావు అర్జీనిస్తూ తమభూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన్ ముంగర సాయిబాబా అర్జీనిస్తూ ఎర్రకాలువ ప్రాజెక్ట్ వద్ద తమ జీవనం సాగిస్తున్నామని, 2018లో సొసైటీలో తమకు సభ్యత్వం ఉన్నప్పటికీ 2024లో తమ పేరు తొలగించడం జరిగిందన్నారు. మాకు సభ్యత్వం కల్పిస్తూ కొత్త మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలిదిండి మండలం కొండంగికి చెందిన కొల్లాటి వెంకటేశ్వరరావు అర్జీనిస్తూ తమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం,1బి అడంగళ్ లో పేరు నమోదుకు చర్యలు తీసుకోవాలని కోరారు.పెదవేగికి చెందిన బొల్లికొండ శ్రీనివాసరావు అర్జీనిస్తూ మండల కేంద్రంలో పిహెచ్ సికు దానంచేసిన భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.కలిదిండి మండలం గురవాయిపాలెంకు చెందిన ఎస్.దామోదరరావు,తదితర రైతులు అర్జీనిస్తూ తమ భూములను సబ్ డివిజన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈక ార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేటు సిబ్బంది పాల్గొన్నారు.

# తోటపల్లి మెగాఉచిత వైద్య శిబిరంలో రూ.5 లక్షల మందుల పంపిణీ

**ఆగిరిపల్లి, మేజర్ న్యూస్:** మండల పరిధి తోటపల్లి గ్రామంలోని మెట్రోపాలిటన్ చర్చ్ ఆధ్వర్యంలో క్రౌన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రమేష్ పాల్, డైరెక్టర్ కాదేష్ ,దైవజనుల సహకారంతో సోమవారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కార్పొరేట్ స్థాయి వైద్యులు మెట్రోపాలిటన్ చర్చి నందు పెద్ద ఎత్తున విచ్చేసిన గ్రామ ప్రజలకు, మండల పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి,ఐదు లక్షల విలువచేసే ఉచిత మందుల పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ,నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొని వైద్య శిబిరం నిర్వాహకులను క్రోమ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక,డైరెక్టర్ రమేష్ పాల్‌కి కాతేష్‌కి ధన్యవాదాలు తెలియజేసారు. రమేష్ పాల్‌కి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, జన్మదినోత్సవాన్ని తోటపల్లి గ్రామ ప్రజల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేపల్లి మాట్లాడుతూ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు లక్షల రూపాయల మందుల పంపిణీ , వైద్య




పరీక్షలు నిర్వహించగా గ్రామ ప్రజలు క్రౌన్ చారిటబుల్ ట్రస్ట్ ని సన్మానించి మరిన్ని వైద్య పరీక్షలు గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాన్ సునిల్, సంఘ పెద్దలు, తోటపల్లి గ్రామ పిఏసిఎస్ అధ్యక్షులు పరిమి శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాల మహానాడు అధ్యక్షుడు బాబురావు



**కైకలూరు, మేజర్ న్యూస్ :** దానగూడెం దళిత వాడలో జరిగినటువంటి దారుణమైనటు వంటి సంఘటన పై సోమవారం మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగా జగన్ బాబురావు ఆధ్వర్యంలో మాల కమిటీ సభ్యులు అందరూ కూడా కలిసి వెళ్లి సంఘటనపై వారి తల్లిదండ్రులను పరామర్శించి ,బంధువులను కూడా పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పి మీకు మాల మహానాడు అండగా ఉంటుంది అని ధైర్యాన్ని ఇచ్చి రావటం జరిగింది. ఈ విషయంపై మాట్లాడుతూ వినాయకుని ఊరేగింపు సందర్భంగా ఏర్పడినటువంటి గొడవలో ఓసి కులానికి చెందినటువంటి కొంతమంది వ్యక్తులు ఎస్సి మాల కులానికి చెందినటువంటి వారిని దారుణంగా కొట్టి తలకాయలు పగలగొట్టి పొట్టలో పేగులు బయటికి వచ్చేలాగా బ్లేడ్లతో కోయటం మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ విషయమై పోలీసు వారు ఇకముందు ఎలాంటి గొడవలు జరగకుండా గట్టిగా బందోబస్తు పెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని బాబురావు కోరారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు దళితులకు అండగా ఉండని పక్షంలో ఆయన్ని కూడా వ్యతిరేకించటం లో వెనకాడే ప్రసక్తే ఉండదని బాబురావు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు గరికి ముక్కు రాజేష్, పళ్లెం ఏసుపదం, కలిదిండి మండలం అధ్యక్షురాలు భూపతి సునీత, ముదినేపల్లి మండలం మాల మహానాడు యూత్ అధ్యక్షుడు మట్ట మోహన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఎక్కడ యూరియా కొరత లేదు

**మొదటిపేజి తరువాయి**

ఏర్పాటు చేశామన్నారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ పంటల బీమాను జగన్ హయాంలో రైతులకు ఇవ్వకుండా ఎగ్గొట్టారని విమర్శించారు. జిల్లాలో అక్రమంగా ఎరువుల తరలింపు అరికట్టేందుకు 22చెక్‌పోస్టులు పెట్టారన్నారు.ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేశారన్నారు. ఈ నిఘాను మరింత లోతుగా కూలంకషంగా ఉండేట్లు చేస్తామన్నారు.ఎరువులఅక్రమ రవాణాదారు లపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామన్నారు.మీడియా సమావేశంలో జెడ్పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, చిర్రి బాలరాజు,సొంగా రోషన్ కుమార్, డిసియంఎస్ ఛైర్మన్‌చాగంటి మురళీకృష్ణ,పాల్గొన్నారు.

## భారత ఆత్మనిర్భర్ లక్ష్యంలో ఉక్కు పరిశ్రమదే కీలక పాత్ర

**మొదటిపేజి తరువాయి**

ప్రారంభమైన 6వ ఐఎస్ఎ స్టీల్ కాన్‌క్లేవ్‌లో ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వృద్ధిలో ఉక్కు పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని, ఇది దేశ జీడీపీలో దాదాపు2శాతం వాటాను కలిగి ఉందని తెలిపారు. దేశ ప్రగతికి, స్వయం సమృద్ధికి ఇది చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా ఉక్కు డిమాండ్ రెండంకెల వృద్ధిని నమోదు చేసిందని, ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వానికి నిదర్శనమని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జాతీయ మౌలిక వసతుల పైప్‌లైన్, మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి జాతీయ విధానాలు ఉక్కు డిమాండ్‌ను గణనీయంగా పెంచి,దేశీయ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని శ్రీనివాస వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నందుకు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కృతజ్ఞతలు తెలిపారు. ఐ ఎస్ ఏ అధ్యక్షులు, ఎంపీ నవీన్ జిందాల్ పరిశ్రమ అభివృద్ధికి కీలక సూచనలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి రెండు రోజులలో జరిగే చర్చలు పరిశ్రమ భవిష్యత్ అభివృద్ధికి విలువైన సూచనలను అందిస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు, ఇండియన్ స్టీల్ అసోసియేషన్ అధ్యక్షులు నవీన్ జిందాల్, సెయిల్ సీఎండీ అమరేంద్ర ప్రకాష్, ఇండియన్ స్టీల్ అసోసియేషన్ సభ్యులు, ఉక్కు పరిశ్రమ ప్రతినిధులు,మంత్రిత్వ శాఖల ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగత్వం చూసి చలించిన జిల్లా కలెక్టర్

**మొదటిపేజి తరువాయి**

అనివివరాల అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం దివ్యాంగుల పెన్షన్ కింద రూ.6 వేలు అందుచున్నదని, ఎప్పుడో తీసుకున్న సదరం సర్టిఫికెట్ లో 45 శాతం వికలాంగత్వం మాత్రమే నమోదు చేయడంతో మెడికల్ పెన్షన్ ను అందుకోలేకపోతున్నామని, మా అబ్బాయిని చూసుకోవడం చాలా కష్టంగా ఉందని,ఎప్పుడు ఇద్దరు వ్యక్తులు పనులు మానుకుని దగ్గర ఉండి చూసు కోవాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. ఈ విషయమై చలించిన జిల్లా కలెక్టర్ వెంటనే డిసిహెచ్ఎస్ ని పిలిచి కొత్తగా సదరం సర్టిఫికెట్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కేసు చాలా దయనీయంగా ఉందని, ప్రత్యేక కేసు కింద ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ పంపడానికి అవసరమైన ప్రతిపాదన సిద్ధం చేస్తే నేనే సంతకం చేసి పంపించడం జరుగుతుందని ఆదేశించారు. అనంతరం వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ అధైర్య పడవద్దు అని సదరం సర్టిఫికెట్ మంజూరుకు చర్యలు తీసుకోవడంతో పాటు,ప్రత్యేక కేసుగా సిఫార్సు చేసి లేఖను పంపడం జరుగుతుందని తెలిపారు.

## హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు కుటుంబానికి స్నేహితుల వితరణ

**మొదటిపేజి తరువాయి**

చేయూత అందించే ఉద్దేశంతో తన బ్యాచ్ వారు కొంత నగదును పోగుచేసి సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఆర్ నాగేశ్వరావు ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని హెడ్ కానిస్టేబుల్ ఎర్రయ్య తెలిపారు. అలాగే అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు జిల్లా అసోసియేషన్ తరపున 1 లక్ష రూపాయల చెక్కును అందించడం జరిగిందని అన్నారు. సుబ్బారావు కుటుంబ సభ్యులకు అన్నివేళలా తామంతా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. తమ కుటుంబానికి చేయూతనిచ్చిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## చేనేత కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా వీరభద్రుడు, జోగేశ్వరరావు







**పాలకొల్లు, మేజర్ న్యూస్ :** ప్రతి చేనేత కార్మికునికి. ఉపవృత్తుల వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్.ఇవ్వాలని, చేనేత కార్మికులకు చంద్రబాబు ప్రకటించిన 25 వేల రూపాయలు తక్షణం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో వీవర్స్ కమ్యూనిటీ హాలులో బళ్ళ చిన వీరభద్రరావు అధ్యక్షతన సోమవారంజరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు తమ్మ చిట్టి కోటేశ్వరరావు చిత్రపటానికి సమతం సముద్ర లింగం పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. సంఘ పతాకాన్ని గుడిమెట్ల సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకువృత్తి పరిరక్షణ కు ప్రభుత్వం చేనేతకు 1000 కోట్లు కేటాయించాలని ,సహకార సంఘాలకు చెల్లించవలసిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన అన్నారు. ఇల్లు లేని వారికి మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, సొంత స్థలం ఉన్నవారికి ఇంటినిర్మాణానికి 6. లక్షల రూపాయలు ఉచితంగా ఇవ్వాలని, చేనేత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలని గురుకుల పాఠశాలలు. ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్న యూనిఫాం బట్టలు చేనేత మగ్గాలపై తయారు చేసిన వస్త్రాలనే ఇవ్వాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం 13 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చల్లా వీరభద్రుడు. ఉపాధ్యక్షులుగా బళ్ళ చిన వీరభద్ర రావు. కార్యదర్శిగా బూడిద జోగేశ్వరరావు.సహాయ కార్యదర్శిగా అక్కింశెట్టి కోట నాగయ్య. కమిటీ సభ్యులుగా ఉయ్యూరు చంద్ర వాసా ప్రదీప్ కుమార్,తిప్ప దొడ్డిపట్ల రామవీరభద్రుడు,కాసా ఉమా కోటేశ్వరరావు,రాపర్తి సత్యనారాయణ,వీరా కోటి వీరయ్య,వాసా సుబ్రహ్మణ్యం, గుడిమెట్ల మల్లేశ్వర రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## నేడు జరిగే 'అన్నదాత పోరు' పోస్టర్లను విడుదల చేసిన వైసిపి నేతలు



**కుక్కునూర్,మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో గల వైఎస్ఆర్సిపి కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను వైసిపి నాయకులు విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల నాయకుడు తాండ్ర రాజేష్ మాట్లాడుతూ వైయస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో మంగళవారం పాత బస్టాండ్ నుండి రెవెన్యూ కార్యాలయం వరకు అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నాం అని తెలిపారు. రైతులకు సరైన సమయంలో ఎరువులు అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని అన్నారు, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని రైతులకు కూటమి ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వటంలేదని అందుకే అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ.2 గాడిద రామచంద్రం, మండల నాయకులు రాయి సత్యనారాయణ రావు వినోద్, మల్లేలా చంటి నాయుడు చేకూరి నవీన్ వర్మ,పగిళ్ల అల్లేశ్, అలేటి కాస్యచరి తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ -చట్టాల ఉద్దేశం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** శనివార్ పేటలోని బాలుర వసతి గృహాన్ని న్యాయవాది జి.పావని సందర్శించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో బాల బాలికలకు మెరుగైన వసతులు కల్పించి, వారి ఆరోగ్యము, పరిశుభ్రతను మెరుగుపరిచి చదువుల పట్ల శ్రద్ధ కలిగే విధంగా సౌకర్యాలు కల్పించడమే చట్టాల ముఖ్య ఉద్దేశమని, వీటిని ఆయా సంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. బాలలకు జాతీయ బాలల స్నేహపూర్వక చట్టాల పైన అవగాహన కల్పించారు.అనంతరం వసతి గృహములోని బాలలకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

# సబ్సిడి ఎరువుల కోసం సిపిఐ ధర్నా

**- సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య సారధ్యం**




**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** చిన్న సన్న కారు రైతులకు బ్యాంకు రుణాలు అందించి సబ్సిడీపై ఎరువులు సరఫరా చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కారం దారయ్య డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం జిల్లా నాయకులు కొప్పుల నాగరాజుతో కలిసి తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కారం దారయ్య మాట్లాడుతూ అసలైన రైతులకు యూరియా, ఎరువులు అందడం లేదని ఆరోపించారు. కల్తీ ఎరువులను సన్నా చిన్న కారు రైతులకు కట్టబెడుతున్నారని అన్నారు. రైతులకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందించాలని సకాలంలో రైతులకు నాణ్యమైన ఎరువులను అందజేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు.అనంతరం తాసిల్దార్ కార్యాలయం విఆర్వోలు తులసి, తిరుపతమ్మ లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఓర్సు శ్రీను, మిరియాల నారాయణ, మొడియం వెంకటేశ్వర్లు, మిర్యాల లక్ష్మణరావు, పూనెం ముత్తమ్మ, మిర్యాల కామయ్య, వేముల శ్రీను, పురేటి పెద్ద కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి




**ద్వారకాతిరుమల,మేజర్న్యూస్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో "అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమం'లో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వి.వి ప్రకాష్ ఆధ్వర్యంలో వెలుగు,అంగన్వాడీ, ఉపాధి హామీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రకాష్ మాట్లాడుతూ నిరక్షరాస్యత అనేది లేకుండా మన వంతుగా అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్యామ్యులు, వెలుగు ఏపీఎం. అరవిందమ్మ, మండల విద్యాశాఖ అధికారి పరసా వెంకట్రావు,ఉపాధి హామీ ఏ.పి.ఓ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి,వెలుగు సిసి,లుసిఏలు, అంగన్వాడీ టిచర్లు,ఉపాధి హామీ సిబ్బంది, పాల్గొన్నారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయం నుంచి బస్ స్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## నేటి అన్నదాత పోరు పోస్టర్ విడుదల చేసిన వైఎస్ఆర్సిపి నాయకులు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** మండలంలోని కామయ్యపాలెం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సంద ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సంద ప్రసాద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాతపోరు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులు వెంటనే పంపిణీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని,ఉచిత పంటల భీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింప చేయాలని అన్నారు.వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడిక భోగేశ్వరరావు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ ఉప్పల రాంపండు,వైస్ ప్రెసిడెంట్ దొడ్డకుల జగదీష్, మండల నాయకులు తగరం రాంబాబు, బొంతు వెంకటరావు,ఆకుల రవి,గుర్రాల సుధాకర్, కట్టురి కృష్ణ, కుసుమ వెంకటేశ్వరరావు, కుమ్మర టోనీ,గంగులరమేష్, సిహెచ్ శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పు తిరిగి చెల్లిస్తాం - మా స్థలం మాకు ఇప్పించండి





**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక షావుకారు పేటలో 210 గజాలు స్థలంపై 35 లక్షల రూపాయలు గుడిమెట్ల సునీత దంపతులు రుణం తీసుకున్నారు, పాలకోడేరుకు చెందిన ఒక వ్యక్తి సేల్ అగ్రిమెంట్ రాయించుకుని రెండు సంవత్సరాల గడువు పెట్టుకునే ఒప్పందం, మూడు నెలలకు వడ్డీ కట్టేందుకు గుడిమెట్ల సునీత దంపతులు అప్పిచ్చిన వ్యక్తి వద్దకు వెళ్లి చెప్పగా వేరే వ్యక్తులకు అమ్మి వేశానని చెప్పడంతో అవాక్కయ్యారు.ఈ స్థలానికి చెందిన వారసులు గుడిమెట్ల గోపాల జగ్గారావు అనారోగ్యం చేయడంతో వైద్య నిమిత్తం అప్పు తీసుకోవడం జరిగిందని సునీత తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామని,అప్పు తిరిగి తీరుస్తామన్న అప్పు ఇచ్చిన వ్యక్తి శ్రీనివాస్ మొండిగా వ్యవహరిస్తూ, ఇబ్బంది పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు.

# కారుమూరి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడక పోతే ప్రజాగ్రహం





**– ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణపై అసత్యాలు మాట్లాడితే సహించం**
**– బల్లిపాడు సొసైటీ వద్ద చైర్మన్ విత్తంశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో రైతులతో నిరసన**

**అత్తిలి,మేజర్‌న్యూస్:** మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు నియోజకవర్గంలోనూ,రాష్ట్రంలోనూ ఎరువులు కొరత ఉందంటూ, యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ చేసిన విమర్శలు అర్ధరహితమైనవని బల్లిపాడు సొసైటీ చైర్మన్ విత్తంశెట్టి వెంకట సత్యనారాయణ (సత్తిబాబు) తీవ్రంగా ఖండించారు. సోమవారం బల్లిపాడు సొసైటీ వద్ద ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పై కారుమూరి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. తణుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో పయినంపచేస్తూ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుచే ప్రశంసలు అందుకున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణపై అవాకులు,చవాకులు పేలడం కారుమూరికి తగదన్నారు. విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని, వైసీపీ హయాంలో రైతులను ఆయన ఎంత అవహేళన చేసి మాట్లాడింది రాష్ట్ర ప్రజలందరికీ గుర్తుండే ఉంటుందని సత్తిబాబు పేర్కొన్నారు. రైతులను ఎర్రి పప్ప అంటూ అవమానించిన ఆనాటి మంత్రి కారుమూరి ప్రజల్లో అభాసు పాలయ్యారని అన్నారు. అందుకే ఆయనతో పాటు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయిందన్నారు.

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, ప్రత్యేకించి బడుగు బలహీన వర్గాలకు, రైతులకు అండదండలుగా నిలిచారని వివరించారు. ఇప్పటికైనా కారుమూరి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని,లేకుంటే ప్రజాగ్రహం తప్పదని విత్తంశెట్టి సత్తిబాబు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ప్రగడ శ్రీనివాస్, అరిగిన నరేష్,ఎంపీటీసీ ప్రగడ నాగేశ్వరరావు, తెలుగుదేశం సీనియర్ నాయకులు గారపాటి ధర్మయ్య,ముత్యాల నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ గారపాట అశోక్,గారపాటి బాబ్జి కసిరెడ్డి వాసు, తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ గునుపూడి నరేష్,వంటాకుల శ్రీనివాసు, రాజాన ఉదయ భాస్కరరావు,కాల గోవిందు కుమార్,సొసైటీ సెక్రటరీ పి.కృష్ణ శాస్త్రి,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.అనంతరం రైతులకు సొసైటీ చైర్మన్ విత్తంశెట్టి సత్తిబాబు రైతులకు యూరియా పంపిణీ చేశారు.

## యూరియా కొరత లేదు - దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**– ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**




**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** ప్రతి మండలంలో యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు దుష్ప్రచారాన్ని నమ్మవద్దని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. సోమవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొంటూ జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎరువుల సరఫరా, పంపిణీపై సమీక్ష సమావేశంలో ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు పాల్గొని నియోజకవర్గంలోని పంటలు రైతుల పరిస్థితులు వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఎరువుల విషయంలో ఎవరు ఆందోళన చెందవద్దని ప్రతి మండలంలో సరిపడా యూరియా స్టాక్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పత్తి,మిర్చి సాగు అధికంగా ఉన్న నేపథ్యంలో అక్కడి రైతులకు మరింత యూరియా అవసరమవుతుందని గుర్తుచేశారు. తగిన సమయానికి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే బాలరాజు కోరినట్లు తెలిపారు.రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పని చేస్తుందని గుర్తు చేశారు.

# మండలంలో అందుబాటులో 77 టన్నుల యూరియా



**కుక్కునూర్,మేజర్ న్యూస్ :** కుక్కునూరు మండలంలో గల రైతులు యూరియా కొరకు ఎవరు ఇబ్బందులు పడొద్దు అని అందరికీ యూరియాను సరఫరా చేస్తామని మండల వ్యవసాయ అధికారి బాలాజీ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యవసాయ ఆఫీసుకు 13 టన్నులు యూరియా శ్రీధర్ వెల్లేరుకు 12 టన్నుల యూరియా మన గ్రోమోర్ సెంటర్‌కు 52 టన్నుల యూరియా మొత్తం 77 టన్నులు యూరియా ఉందని ఆ మొత్తాన్ని కూడా మంగళవారం నాడు రైతులకు సరఫరా చేయటం జరుగుతుందని రాబోయే మరొక వారంలో కూడా 75 టన్నుల యూరియా వస్తుందని అందువల్ల రైతులు అందరికీ యూరియాను అందించడం జరుగుతుందని, గ్రోమోర్ సెంటర్ వారిని కూడా రైతులకు ఇష్టమైన ఎరువులు మాత్రమే ఇవ్వాలని రైతులు ఎవరిని బలవంతం చేయకూడదని వారికి తెలియజేయడం జరిగిందని వారు అన్నారు.

## నేటి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగేనా?

**– గత సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు**
**– నాడు మండల పరిషత్ అధికారులు సిబ్బందిపై ఎంపిపి, సభ్యుల ఆగ్రహం**



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** గత మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ,సభ్యులు తమను మండల పరిషత్ అధికారులు సిబ్బంది పట్టించుకోవడంలేదని సమావేశాన్ని బహిష్కరించిన సంగతి విధితమే సమావేశం ప్రారంభమై చర్చిస్తుండగా ఒక్కసారిగా ఆగ్రహంతో సమావేశాన్ని బాయ్ కాట్ చేస్తూ నిష్క్రమించారు. మరల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా మండల పరిషత్ అధికారులు ,సిబ్బందిపై మాకు సహకరిస్తారనే నమ్మకం లేదని పలువురు సభ్యులు వాదనలు వినిపిస్తున్నాయి.ఈ క్రమంలో సమావేశం జరుగుతుందా లేదా అనేది ప్రశ్నార్ధకంగా మారింది. ప్రతి సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడం గమనార్హం. మండలంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమౌతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా చర్చించే సమావేశం సజావుగా సాగేలా అధికారులు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

## తాడేపల్లిగూడెం అభివృద్ధిపై కేంద్ర మంత్రితో ఎమ్మెల్యే బొలిశెట్టి చర్చలు

**ఢిల్లీ/తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధిపై ఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మని కలిసిన శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్. ఎమ్మెల్యేతో పాటు బిజెపిఅసెంబ్లీ ఇంచార్జి ఈతకోట తాతాజీ,బిజెపి రూరల్ మండల ఇంచార్జి నరిసే సోమేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.



## యూరియా సరఫరా చేయాలని సీపీఐ ధర్నా




**వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** వ్యవసాయానికి సరిపడ యూరియా సరఫరా చేయాలని కోరుతూ సీపీఐ ఆద్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మునీర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.పట్టా రైతులకు యూరియా సరఫరా చేయడంతో పాటు వ్యవసాయం చేస్తున్న ప్రతీ ఒక్క రైతుకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు.అలాగే సబ్సిడీ పై ఎరువులు సైతం పంపిణీ చేయాలని కోరారు.అనంతరం తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాడిస రాము,సర్పంచ్ పిట్టా ప్రసాద్,ఎర్రా మధు,కె వెంకటేశ్వర రావు,గౌస్,దుర్గారావు,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మాణం అవుతున్న శివాలయం వద్ద అన్న సమారాధన





**– ప్రతి సోమవారం 500 మంది భక్తులకు నిర్వహణ**
**– ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించండి**

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :**జీలుగుమిల్లిలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళి( శివాలయం) స్వామి వారి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళి స్వామి వారి ఆలయ నిర్మాణం సుమారు మూడు కోట్ల మేర ఖర్చు అవుతుందని అంచనాతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టిన కమిటీ సభ్యులు దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఆలయ నిర్మాణం శరవేగంగా జరగాలంటే ఆలయ ప్రాంగణంలో ప్రతి సోమవారం అన్న సమారాధన నిర్వహించాలని పండితుల సూచన సలహాల మేరకు అన్న సమారాధన కార్యక్రమాన్ని భక్తులు దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణాన్ని దాని ఉప ఆలయాలు నిర్మాణాలు పరిశీలించిన అనేకమంది భక్తులు తమ తమ విరాళాలను అందించి సహకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ప్రతి సోమవారం సుమారు 500 మందికి అన్న సమారాధన చేస్తున్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు, శుభకార్యాలు పేరుతో అన్న సమారాధనకు తమ సహకారం అందిస్తున్నారని వారందరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అలాగే ఆలయ నిర్మాణం విషయం తెలుసుకున్న అనేకమంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి తమ తమ విరాళాలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారని వారి సహకారంతో ఆలయ నిర్మాణం వేగంగా జరుగుతున్నట్లు కమిటీ సభ్యులు మాతంశెట్టి కిషోర్ బాబు, కక్కిరాల శ్రీనివాస్, కొనకళ్ళరాము,కోరుకొండరామకృష్ణ,మద్దుల వాసు పేర్కొన్నారు. విరాళాలు అందించాలనే భక్తులు ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి తమకు తోచిన విధంగా విరాళాలు ఇచ్చి శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళి స్వామివారి ఆలయం ఉప ఆలయాల నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. సహకారం అందించ వలసిన భక్తులు, దాతలు 9949808967 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

# ఎరువులు అక్రమంగా తరలించే వారిపై పీడీ కేసులు




**– రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల ఆదేశం**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో ఎరువులు అక్రమంగా నిల్వ చేయడం, అక్రమంగా తరలించే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలనీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా అధికంగా ఈ సంవత్సరం జిల్లాకు యూరియా, డిఏ పి , తదితర ఎరువులను జిల్లాకు అధికంగా అందించామన్నారు.ప్రస్తుత సీజన్లో 33 వేల 762 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం కాగా, ఇప్పటికే 30 వేల 557 టన్నులను అందించామని, మరో రెండు రోజుల్లో మరో 2200 మెట్రిక్ టన్నులు అందుబాటులోనికి రానున్నదన్నారు.ఎరువుల పంపిణీ విషయంలో రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అయినప్పటికీ కొంతమంది రైతులు ముందుజాగ్రత్తగా ఎరువులను అదనంగా కొనుగోలు చేయడంతో తాత్కాలికంగా కొరత ఏర్పడిందని, అయినప్పటికీ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎరువులను అందుబాటులో ఉంటున్నామన్నారు. జిల్లా నుండి ఎరువులు తరలిపోకుండా 29 చెక్ పోస్టులలో నిఘా పెట్టడం జరిగిందని, నిఘాను మరింత పెంచాలన్నారు. జిల్లా నుండి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలని, అక్రమంగా తరలించేవారిపై, ఎరువులను బ్లాక్ మార్కెటింగ్, దారిమళ్లించే వారిపై, అధిక ధరలకు అమ్మడం, అక్రమంగా నిల్వ చేసేవారిపై 6ఏ కేసులు కాకుండా పీడీ ఆక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఎరువుల కొరత ఏర్పడిందనే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ఆయిల్ పామ్ లో యూరియా వినియోగం తగ్గించేలా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఎరువుల పంపిణీలో రైతుల సమస్యలను తెలియజేసేందుకు సంబంధిత అధికారుల ఫోన్ నంబర్ల వివరాలను జిల్లాలోని అన్ని సొసైటీలు, ఎరువుల డీలర్లు, డిసిఎంఎస్ కేంద్రాలు, రైతు సేవ కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు.రాష్ట్రంలో ఎరువుల పంపిణీపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతీరోజు జిల్లాల కలెక్టర్లతో సమీక్షిస్తున్నారని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సర కన్నా అధికంగా ప్రస్తుత వ్యవసాయ సీజన్లో ఎరువులను రైతులకు అందించారన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలతో రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ జరిగిందన్నారు. చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలోని రైతులకు ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగిందని, జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని, రైతుల అవసరాలకు తగినవిధంగా ఎరువులు అందించారన్నారు. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఎరువుల కొరత లేదన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ తమ 21 బ్రాంచీలలో 396 టన్నుల ఎరువుల నిల్వలు ఉంచి, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవనాలాధికారి రామ్మోహన్, జిల్లా సహకారాధికారి ఆరిమిల్లి శ్రీనివాస్,మార్కెఫెడ్ అధికారి సిహెచ్.ప్రసాద్ గుప్త, జిల్లాలోని ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు,పలువురు రైతులు పాల్గొన్నారు.

# కిడ్నీ డయాలసిస్ పరీక్షలు



**తణుకు,మేజర్ న్యూస్ :** వంకా సత్యనారాయణ నాగమణి డయాలసిస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఉందుర్తి పాల్ ఫౌండేషన్ చైర్మన్ ఉందుర్తి ప్రసన్న కుమార్ చెప్ప పైడిపర్రు తేతలి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిజిడి లయన్ మాదిరెడ్డి బాబుజి రావు సౌజన్యంతో వరల్డ్ కిడ్నీ డే డయాలసిస్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్ వంక రాజ కుమారి విచ్చేసి మాట్లాడారు. పేషెంట్లు ఎక్కువమంది వస్తున్న కారణంగా యూనిట్ని పూర్తిగా 10.పడకల నుండి 15 పడకలుగా విస్తరించామని తెలిపారు.డయాలసిస్ యూనిట్ సెక్రటరీ బాబుజీ రావు మాట్లాడుతూ 9వ సంవత్సరంలోకి అడుగు పెట్టి పేషెంట్స్‌కు అత్యున్నత విలువైన సౌకర్యాలు అందిస్తూ ప్రజల మన్నలను పొందుతున్నామని అన్నారు. ప్రభుత్వం ద్వారా రావలసిన బకాయిలు రూ.1.95,94,680 ఉందని తెలియజేశారు. ఆర్థికపరంగా అత్యంత భారమైనా వంకా రవీంద్రనాథ్ (ఎమ్ఎల్ సి )ఫ్యామిలీ ఈ మొత్తం భరిస్తూ ఎక్కడ ఏ లోటు లేకుండా యూనిట్ ని సకలసౌకర్యాలతో నడుపు తున్నరన్నారు. దీన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే బకాయి పడిన నిధులను వెంటనే విడుదల చేయడానికి కృషి చేయాలని బాబూజీ రావు కోరారు. పేషంట్స్ కేక్ కట్ చేసి ఈ వరల్డ్ కిడ్నీ డే ని ఘనంగా నిర్వహించారు.యూనిట్ లోని పేషంట్స్ అందరకు యాపిల్స్ జామకాయలు అందజేసారు. ఏరియా హాస్పటల్ డాక్టర్స్ శారదా ప్రసన్న,డాక్టర్ ధర్మ తేజ పేషంట్స్ ను పరీక్షించి అవసరమైన అవగాహన కల్పించారు.ఈ క్యాంపులో పాల్గొని పెషేంట్ లకు విశిష్ట సేవలు అందించిన వైద్యులకు సిబ్బందికి లయన్స్ క్లబ్ సభ్యులకు ఫౌండేషన్ అధ్యక్షులు ప్రసన్నకుమార్ కృతజ్ఞతలు తెలియజేసారు.

## మాదాసును పరామర్శించిన ముదునూరి

**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** గోల్డెన్ లేస్ ఎక్స్పోర్ట్స్ అధినేత మాదాసు గోపాలకృష్ణను వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు పరామర్శించారు. గోపాలకృష్ణ ఇటీవల జరిగిన ఘటనలో కాలుకు తీవ్ర గాయం కావడంతో శస్త్ర చికిత్స చేయించుకుని బెడ్ రెస్ట్‌లో ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రసాదరాజు సీతారాంపురంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైసిపి కేంద్ర పాలక మండలి సభ్యులు పిడి రాజు, మాజీ జెడ్పీటిసి చాగంటి సత్యనారాయణ, మైలబత్తుల శ్రీనివాస్ పలువురు వైసీపీ కార్యకర్తలు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు గోపాలకృష్ణను పరామర్శించారు.

# తూర్పుతాళ్ల బాధిత కుటుంబాలను పరామర్శించిన విప్ నాయకర్



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని తూర్పు తాళ్ళు గ్రామంలో ఇటీవల జరిగిన గణేష్ నిమజ్జనాల్లో గాయపడిన, మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సోమవారం పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు అన్ని విధాల సహాయం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి




**భీమవరం,మేజర్ న్యూస్ :** సోమవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా.కెసిహెచ్ అప్పారావు, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై. దోసి రెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈరోజు వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలనుంచి 192 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పిజిఆర్ఎస్ లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు.

– అందిన ఫిర్యాదులలో కొన్ని –

కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన పొన్నంపల్లి వెంకటలక్ష్మి అర్జీని సమర్పిస్తూ, నా భర్త 2024లో చనిపోయారని, నాకు ముగ్గురు పిల్లలని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నానన్నారు. వితంతు పెన్షన్ మంజూరు కొరకు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని, దయచేసి తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.తాడేపల్లిగూడెం 32వ వార్డు వాస్తవ్యురాలు తోట శశిరేఖ అర్జీని సమర్పిస్తూ, నా కుమారుడు తోట శ్రీను, కోడలు జ్యోతి నన్ను ఇంటి నుంచి వెళ్లిపొమ్మంటు ప్రతిరోజు చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. నా ఇంటిని, ఒక ఎకరం పొలాన్ని వాటాల రూపంగా రాసి ఇచ్చానన్నారు. నాకు ప్రాణహాని ఉందని దయచేసి నా ఇల్లు, పొలంపై నాకు హక్కులు కల్పించాలని కోరారు.వీరవాసరం మండలం పెరికిపాలెం గ్రామానికి చెందిన పోసినశెట్టి వాసుదేవ స్వామీజీ తనకు 1.76 సెంట్ల వ్యవసాయ భూమి ఉందని, సమీప రైతు అనధికారికంగా రొయ్యల చెరువు తవ్వి సాగు చేస్తున్నారని దీని వల్ల నా భూమి చౌడు బారిపోయి ఆర్థికంగా నష్టం జరుగుతోందన్నారు. దయచేసి అనధికార చెరువును తొలగించి తనకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.పాలకొల్లు పట్టణం 30వ వార్డుకు చెందిన కురుమెళ్ళ అప్పారావు అర్జీని సమర్పిస్తూ, మూడు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ కారణంగా తన కాలు తీసివేశారని, ప్రస్తుతం ఏ పని చేయలేకపో తున్నానన్నారు.

ఇప్పటి వరకు వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటానని, దయచేసి వికలాంగు పించనుగా మార్పు చేసి వికలాంగు పింఛన్ మంజూరు చేయాలని కోరారు.పాలకొల్లు శ్రీరామపేటకు చెందిన బేరం మల్లికార్జునరావు అర్జీ సమర్పిస్తూ, నా భార్య,నా రెండో కుమార్తె నా దగ్గర ఉన్న డబ్బు, నా పేరున వున్న దస్తావేజు కోసం పలు రకాలుగా చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. నేను తినే ఆహారంలో విషం కలిపి నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దయచేసి నా భార్య, రెండవ కుమార్తెపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన కూనపు శ్రీనివాస్, తాను పుట్టుకతో వికలాంగుడునని ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నానని నా పోషణ నిమిత్తం దయచేసిఅంత్యోదయ కార్డుఇప్పించాలనిఅర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిపునల్ సభ్యులు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల పరిష్కార వేదికకు 38 ఫిర్యాదులు






**– పరిష్కారానికి ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, ఎఎస్పీ సూర్య చంద్రరావు ఆదేశాలు**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్, ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమమును జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్,అదనపు ఎస్పీ ఎన్. సూర్య చంద్రరావు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫిర్యాదుల స్వీకరణలో పారదర్శకత పూర్తిగా "పేపర్‌లెస్" పద్ధతిలో నిర్వహించబడింది.

ప్రజలు తమ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేయకుండా నేరుగా తమ సమీప సబ్–డివిజన్, సర్కిల్ పోలీసు అధికారులకు అంద చేయవచ్చని ఎస్పీ తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేయాలనుకునేవారు https://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని సూచించారు.ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవడానికి 1100 టోల్-ఫ్రీ నెంబర్ ను సంప్రదించ వచ్చని తెలియజేశారు. మొత్తం 38 ఫిర్యాదులు అందగా, వాటిలో ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు,మోసపూరిత లావాదేవీలకు సంబంధించిన ఎక్కవ పిర్యాదులు అందినవి, ఎస్పీ గారు ఫిర్యాదుదారుల తో నేరుగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని, సదరు ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ చేసి నివేదికలను సమర్పించవలసినదిగా క్రింది అధికారులకు తగిన సూచనలు సలహాలు, ఆదేశాలు ఇచ్చారు.పబ్లిక్ గ్రీవెన్స్‌కు వచ్చిన వృద్ధులకు వద్దకు జిల్లా ఎస్పీ స్వయముగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తగిన సూచనలు చేశారు. ఈ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు ఏలూరు శ్రీ సత్య సాయి సేవా సంఘం వారు భోజన ఏర్పాట్లు చేశారు.

## సకాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలి : ఆర్డిఓ దాసిరాజు



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆర్డిఓ దాసిరాజు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 65 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ ఎక్కువగా స్థలాలు, పొలాలు, సరిహద్దు తగాదాలపై ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజల నుండి వస్తున్న సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులో గానే పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరికి ఘన నివాళి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆయనకు నివాళులు అర్పించారు. సోమవారం నాడు స్థానిక పవర్ పేటలో గల ఉద్దరాజు రామం భవనంలో ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌విడి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బి బలరాం,జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎ.రవి పూలమాల వేశారు. అనంతరం ఈ వర్ధంతి సభకు విచ్చేసిన సిపిఎం నాయకులు కార్యకర్తలు పూలతో ఏచూరి కి నివాళులు అర్పించారు.

ఈ సభను ఉద్దేశించి బలరాం, రవిలు మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి 1952లో మద్రాసులో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించారని, జాతీయోద్యమ భావాలు, స్వాతంత్రోద్యమ భావాలు, జాతీయ భావాలు, దేశభక్తి భావాలు ఏర్పరచుకున్న వ్యక్తి సీతారాం ఏచూరి అని అన్నారు.భారతజాతి, తెలుగు జాతి గర్వించదగ్గ ముద్దు బిడ్డలలో ఒకరు ఆయనని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ లింగరాజు, తెల్లం రామకృష్ణ, కె శ్రీనివాసు, పి రామకృష్ణ, జిల్లా నాయకులు ఎం జీవరత్నం,ఎస్ మహంకాళి రావు, తామ ముత్యాలమ్మ,పి మంగరాజు,పి సూర్యారావు,గుడిపాటి నరసింహారావు, పంపన రవికుమార్,శ్యామల రాణి,అరుణ కుమారి,కనకారావు, గోపి, ఇస్సాకు,ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ ,హెచ్ఐవి వ్యాధుల పట్ల అవగాహన : డాక్టర్ శాంతిశ్రీ



**ముదినేపల్లి , మేజర్ న్యూస్ :** క్షయ , హెచ్ఐవి వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ముదినేపల్లి పి హెచ్ సి వైద్యురాలు శాంతిశ్రీ పేర్కొన్నారు. మండల ంలోని వడాలి పిహెచ్సి ఉప కేంద్రంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ , చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు హెచ్ఐవి , క్షయ వ్యాధుల పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులను ఆరంభంలో గుర్తిస్తే చికిత్స సులభతరంమవుతుందన్నారు. అప్రమత్తంగా లేకపోతే ప్రాణహాని కలుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 1097 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఈ వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్లు సిహెచ్ నాగలక్ష్మి , చంద్రావతి , ఏఎన్ఎం జి చంద్రిక , ఎం ఎల్ హెచ్ పి జి స్నేహ , ఆశా వర్కర్లు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళిత రైట్స్ ఫోరమ్ నేత నూకపెయ్యి కార్తీక్ గుండెపోటుతో మృతి





**ఏలూరు,మేజర్ న్యూస్ :** నగరానికి చెందిన ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరమ్ నాయకుడు నూకపెయ్యి కార్తీక్ (45) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. శాంతినగర్ లోని ఆయన ఇంటి వద్ద ఉండగా ఒక్క సారిగా గుండెపోటు రావడంతో వెంటనే కుటుంబ సభ్యుల అతన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. కార్తీక్ మృతికి నగరంలోని దళిత సంఘాలు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపాయి.

### రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేర ప్రసాద్‌కు సత్కారం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు మండలం మానూరు గ్రామంలో సోమవారం మండల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రస్థాయిలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేర ప్రసాద్ మాస్టారిని,ఉపాధ్యాయిని తాలాడ అరుణ, ఎస్ఎంసి చైర్మన్ పేరం రాము శిరీష, తేర. ప్రభుదాసు, తేర. జగదీష్,అంగన్వాడి టీచర్ కడియం కుమారి, పిల్లలు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు, అలాగే మాదేపల్లి,మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగతోట సునందకుమారి , యు.గంధర్వ రావు,వి.రాధా దేవి,ఎం శ్రీలక్ష్మి, శివ జ్యోతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయుడు పిల్లలు తేర ప్రసాద్‌ని శాలువాతో పనులు ఇచ్చి పుష్పాలంకరణ చేసి ఘనంగా సత్కరించారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పట్టణ వరిధి లో గల జీవీఎస్ వీఆర్ఎం మంన్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ నందు అంతర్జాతీయం అక్షరాస్యతా దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఉద్దేశించి సహోపాధ్యాయులు టి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అక్షరాస్యత దినోత్సవం అంతర్జాతీయంగా జరపడానికి సెప్టెంబర్ 8ని నిర్ణయించడం జరిగిందన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడి తమ ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో విద్యార్థులకు హోంవర్క్ డైరీలు. క్రేయాన్సు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అయిన జి వెంకటేశ్వర్లు. నందిని. లీలా కుమారి. పి .యం.సి చైర్మన్ కరణం పాపారావు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల మనోభావాలు దెబ్బతీశారు : డీలర్స్ అసోసియేషన్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** సోషల్ మీడియా లోఅసత్య ఆరోపణలతో రేషన్ డీలర్ల మనోభావాలను దెబ్బతీశారని రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక కిరాణా మర్చంట్స్ చాంబర్ కార్యాలయంలో సోమవారం చౌక డిపో డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక కఠిన నియమ నిబంధనలను రూపొందించిందని వాటిని నూరు శాతం పాటిస్తూ ప్రజలందరికీ చౌకడిపోల ద్వారా రేషన్ బియ్యం తో సహా సరుకులను సక్రమంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే కమిషన్ చౌక డిపోల నిర్వహణకు సరిపోవటం లేదని అయినప్పటికీ తాము నిబంధనల ప్రకారం సరుకులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. రేషన్ మాఫియా అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిగూడెం నియోజవర్గంలో రేషన్ బియ్యం సంబంధించి ఎలాంటి అక్రమాలు జరగడంలేదని, నిజా నిజాలు తెలుసుకోకుండా అవాస్తవాలను ప్రచారం చేయవద్దని వారు కోరారు. ఈ సమావేశంలో చౌక డిపో డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెదపోలు వీర రాఘవులు, సంఘం తాడేపల్లిగూడెం మండల అధ్యక్షులు సిరం నాగార్జున, పెంటపాడు మండల అధ్యక్షులు దూలం తాతాజీ, తాడేపల్లిగూడెం ప్రధాన కార్యదర్శి పరిమి రామావతారం, పెంటపాడు మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు,గంధం బాబు తదితరులు మాట్లాడారు.

# దానగూడెం దళితులపై దాడికి బాధ్యులను శిక్షించాలి

**ఆర్పిఐ ఇండియా( భీమరావు అంబేడ్కర్) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పులేటి డిమాండ్**





**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ జనరల్ హాస్పటల్ 51వ వార్డులో కైకలూరులో అగ్ర కులం దాడిలో గాయపడి చికిత్స పొందుచున్న మాల కులానికి చెందిన అనిల్,దినేష్ ను పరామర్శించి వైద్య చికిత్స కోసం కొంత ఆర్థిక సహాయాన్ని డాక్టర్ ఉప్పులేటి దేవి ప్రసాద్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమరావు అంబేద్కర్) అందజేసారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ దళిత వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేతాళ సుదర్శనం,రాష్ట్ర అధ్యక్షులు నూతలపాటి జగదీష్ స్వయంగా బాధితులకు ఆర్థిక సహకారాన్ని అందించాడు.కత్తిపోట్లతో గాయపడిన అనిల్‌ను డిశ్చార్జ్ చేయటానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని. ఇనప రాడ్లతో కొట్టిన దినేష్ ను కనీసం ఇన్ పేషెంట్ కూడా చేర్చుకోకుండా, ఔట్ పేషెంట్ చికిత్స చేసి పంపేశారంటే పోలీసులు ఎంత దమన నీతితో ప్రవర్తిస్తున్నారో అర్థం చేసుకోవాలని ఉప్పులేటి దేవి ప్రసాద్ అన్నారు.ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన పార్టీ అధికారంలోకి రావడంతో ప్రతి సందర్భంలో పోలీసుల సహకారంతో కాపులు దళితులను దారుణంగా చంపటం, గాయపరచడం, దూషించటం నిత్యకృత్యంగా జరుగుతుంది.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తన కులస్తులను నియంత్రించ కపోవటమే ఇంత దారుణాలకు కారణం. శాంతి భద్రతల పరిరక్షణలో చంద్రబాబు వైఫల్యం చెందారని ఆయన విమర్శించారు. పోలీసులు పేరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కానీ అసలు దోషులను వదిలేశారని ఆరోపించారు. ఈ దాడిని కుట్రపూరితంగా ఒక ప్రణాళిక ప్రకారం నడిపించిన వ్యక్తుల పై కేసు నమోదు చేయలేదని, రేపు ఎల్లుండో బాధితుల పైన కౌంటర్ కేసులు పెట్టడానికి పోలీసులు సిద్ధమవుతు న్నారని అన్నారు. కల్పిత కథలను పోలీసులు సృష్టించి తమ స్వామి భక్తిని ప్రకటించుకుంటానికి అత్యంత దారుణంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అటు వైసీపీ ప్రభుత్వంలోనైనా ఇటు టిడిపి ప్రభుత్వం లోనైనా దళితులకు నిరంతరం రాజ్యాంగం నిర్దేశించిన పౌర హక్కుల ఉల్లంఘన జరుగు చున్నది అన్నారు. ఉప్పులేటి దేవి ప్రసాద్ హాస్పటల్ అధికారులతో మాట్లాడి దినేష్ ను ఇన్ పేషెంట్గా చేర్పించారు.

**- దానగూడెంలో అనుమతి నిరాకరణ -** అయినా....ఈ కార్యక్రమం అనంతరం కైకలూరులోని దానగూడెంకు వెళ్లడం జరిగింది.అక్కడ ప్రజలకు ధైర్యం చెప్పటానికి ఏలూరు నుండి వెళ్లిన ఏ ఒక్కరిని అనుమతించలేదు. రెండు చోట్ల పోలీస్ టికెట్లు ఏర్పాటు చేసి బాధితులు బయటికి వెళ్లకుండా.బయట వారు లోనికి వెళ్లకుండా ప్రజాస్వామ్యబద్ధమైన రాజ్యాంగబద్ధమైన హక్కులను పోలీసులు నిర్వీర్యం చేస్తున్నారు. అయినప్పటికీ ఉప్పులేటి దేవి ప్రసాద్ చొచ్చుకొని గ్రామానికి వెళ్లి బాధితులు అందరిని కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. తదనంతరం మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకత్వం బేతాళ సుదర్శనం నూతలపాటి జగదీష్ బేతాళ నాగరాజు గ్రామాన్ని సందర్శించి పరమ పూజ్య బోధిసత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు తెలియజేసి,జాతీయ ఎస్సీ కమిషన్కు ఈ ఫిర్యాదు గూర్చి పూర్తి వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దొరబాబు, బేతాళ నాగరాజు ,గుర్రం రామారావు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకత్వం ఏలూరులోని స్థానికలు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర కళాశాల ఉపాధ్యాయుడికి రాష్ట్ర స్థాయి పురస్కారం



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపెటెన్సీస్, నీతి అయోగ్ ఇండియా ప్రధానం చేసే ఎక్సలెన్స్ ఇన్ బెస్ట్ టీచర్ అవార్డుని మండలంలోని సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ బొమ్మ రామకృష్ణను వరించింది. ఈ నెల 5వ తారీకున అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో వర్చువల్‌గా ఆయనకు ప్రధానము చేశారు.ఈ సందర్భంగా బొమ్మ రామ కృష్ణ ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి,కళాశాల చైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కే.వెంకటేశ్వర స్వామి,డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల డైరెక్టర్స్, ప్రిన్సిపాల్ డా. ఎస్.సురేష్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ డా. ఏ గోపీచంద్, తదితర విభాగాధిపతులు,ఏఐ అండ్ ఎమ్ ఎల్ అధ్యాపకులు విద్యార్థులు అభినందనలు తెలియచేశారు.

# ట్రిబుల్ ఐటీలో ఫ్యాకల్టీపై కత్తితో విద్యార్థి దాడి : పోలీసుల అరెస్టు





**నూజివీడు, మేజర్ న్యూస్ :** నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ప్రొఫెసర్ పై ఎంటెక్ విద్యార్థి కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. తరగతులకు హాజరుకాని విద్యార్థి హాస్టల్ రూమ్ లోనే ఉంటూ పరీక్షలకు హాజరయ్యే ప్రయత్నం చేశాడు.. దీనిని అడ్డుకున్న అధ్యాపకుని పై కత్తితో దాడి చేసిన సంఘటన సంచలనం రేపింది. అయితే ఆ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంటెక్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి విద్యార్థి వినయ్ పురుషోత్తం తరగతులకు హాజరుకాకుండానే ల్యాబ్ పరీక్షకు హాజరు కావడంపై సివిల్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ గోపాల రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ హెచ్వోడీల అనుమతులు ఉంటేనే పరీక్షకు హాజరై అవకాశం ఉంటుందని తేల్చి చెప్పడంతో పరీక్ష గదిలోనే ఉన్న వినయ్ పురుషోత్తం. పరీక్ష జరిగే సందర్భంలో గదిలో ఉండకూడదని సెక్యూరిటీకి బయటకు పంపాల్సిందిగా సూచించిన గోపాలరాజు. దీంతో ఆగ్రహంతో ముందుగా తీసుకువచ్చిన కత్తితో విచక్షణ రహితంగా ప్రొఫెసర్ గోపాల రాజు పై దాడికి దిగిన వినాయక పురుషోత్తం. దాడి ఘటన చూసి నిర్ఘాంత పోయిన విద్యార్థులు వినయ్ ను అడ్డుకోవడంతో గోపాల్ రాజుకు ప్రాణాపాయం తప్పింది. అప్పటికే మెడ చేతి నుదుడిపై పలు ప్రదేశాలలో కత్తి ఘాట్లు పడటంతో ట్రిబుల్ ఐటీ ఉన్నతాధికారులు హుటాహుటిన గోపాలరాజును ట్రిబుల్ ఐటీ లోని వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కత్తితో దాడి చేసిన విద్యార్థిని ట్రిపుల్ ఐటి అధికారులు పోలీసులకు అప్పగించారు.ప్రొఫెసర్ గోపాల్ రాజు పై దాడికి పాల్పడిన వినయ్‌ను అరెస్ట్ చేసిన నూజివీడు డిఎస్పి.

## అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం : ఎంపీపీ మైలబత్తుల సోనీ



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం అని ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామకార్యదర్శులకు అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎంపీపీ సోనీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్ర రావు మాటా డుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక రకాలుగా నిధులు మంజూరు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2.0 స్కీం కింద అభివృద్ధిపై అంచనాలు తయారు చేసేందుకు ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. తొలుత బాబా సాహెబ్ అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొక్క రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, పంచాయతీల విస్తరణ అధికారి నాగేంద్ర కుమార్, తదితరులు మాట్లాడారు.

## నేడు వైసిపి చే రైతన్నలకు అండగా అన్నదాత పోరు



**ఆచంట,మేజర్ న్యూస్ :** రైతన్నలకు అండగా అన్నదాతపోరు నిరసన కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకోచ్చి రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని జిల్లా పరిషత్ ప్రతి పక్ష నేత గుంటూరి పెద్దిరాజు తెలిపారు ముందుగా అన్నదాతపోరు పోస్టర్ ఆవిష్కరణ చేశారు, నేడు మంగళవారం ఉదయం 9:30 గంటలకు నర్సాపురం ఆర్ డి ఓ కార్యాలయం వద్ద ఎరువుల బ్లాక్ మార్కెట్ పై రైతన్నలకు అండగా వైయస్ ఆర్ సిపి ఆధ్వర్యంలో అన్నదాత పోరు ద్వారా నిరసన తెలుపుతూ వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు,ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి, పి ఏ సి సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో వైసీపీ సీనియర్ నాయకులుకర్రి వెణుబాబు ముప్పాల వెంకటేశ్వర రావుజక్కంశెట్టి చంటిసుంకర సీతారామ్‌కోట వెంకటేశ్వర రావుపెచ్చెట్టి సత్యనారాయణముత్యాల నాగేశ్వరరావుఏనుగుపల్లి వరప్రసాద్,యల్లమెల్లి రాజేష్, పుచ్చకాయల నాగార్జున, బొక్కా రామకృష్ణ, తడాల చంద్ర శేఖర్, మన్నె సుబ్బా రావు, కొండేటి వరప్రసాద్, పెదపూడి చంటిబాబు, బీరా బాలు, కుసుమె నారాయణ మూర్తి తదితరులు పాల్గున్నారు.

## అన్నిదానాల కెల్లా అన్నదానం గొప్పది :ఎమ్మెల్యే అంజిబాబు

**- వరసిద్ధి వినాయక దేవస్థానంలో అన్న సమారాధన**



**భీమవరం,మేజర్ న్యూస్:** అన్ని దానాల కెల్లా అన్నదానం గొప్పదని, 58 ఏళ్లుగా వినాయక చవితి వేడుకలను నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బుధవారం మార్కెట్ లోని శ్రీవరసిద్ధి వినాయక శ్రీభవాని దుర్గ మల్లేశ్వరి స్వామివార్ల దేవస్థానంలో 58వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం నిర్వహించిన అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా స్వామివారికి మహానివేదన చేసి హారతులు ఇచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ గెలుపు ఖాయం

– అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్రం అనుమతిపై హర్షం
– ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు/ఢిల్లీ,మేజర్ న్యూస్ : ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధిస్తుందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఉపరాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ఎంపీలు పాటించాల్సిన నియమ నిబంధనలపై సోమవారం ఉదయం టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావుకృష్ణ దేవరాయలు నివాసంలో పార్టీ ఎంపీలకు శిక్షణా సమావేశం జరిగింది. ఈసమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ పాల్గొన్నారు. అనంతరం, మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పార్లమెంటు ఉభయ సభల్లో ప్రస్తుతం ఉన్న సభ్యులు 781మంది కాగా, విజయం సాధించడానికి 391 అనుకూలంగా ఓటేస్తే చాలునని, కానీ ఎన్డీయేకు లోక్‌సభలో 293 మంది, రాజ్యసభలో 129 మంది మొత్తంగా 422 మంది సభ్యుల బలం ఉందన్నారు. అంటే విజయానికి అవసరమైన దానికంటే 31 మంది సభ్యులు ఎక్కువే ఉన్నారు. ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తాము మాత్రం తమ పార్టీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్ సూచనల ప్రకారం రాధాకృష్ణన్ కి అనుకూలంగా ఓటు వేసి ఆయనను ఉపరాష్ట్రపతిగా గెలిపిస్తామని ఎంపీ స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా సోమవారం ఢిల్లీ వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో జరిగిన ఎంపీల సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ ఎన్నిక సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీలకు నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. అదనపు పొగాకు కొనుగోళ్లకు అనుమతిపై కేంద్రానికి ధన్యవాదాలు. స్వల్ప పెనాల్టీతో అదనపు పొగాకు కొనుగోళ్లకు అనుమతిస్తూ కేంద్రం గెజిట్ ఉత్తర్వు జారీచేయడంపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## యూరియా, తదితర ఎరువులను సక్రంగా అందించాలి




ఏలూరు రూరల్,మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో ఖరీఫ్ పంటకు రైతులకు అవసరమైన యూరియా, తదితర ఎరువులను సక్రంగా అందించాలని కోరుతూ సోమవారం నాడు ఏలూరు రూరల్ మండలం చాటపర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు వ్యవసాయ కార్మికులు నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు సిపిఐ రాష్ట్ర పిలుపులో భాగంగా ఏఐకేఎస్ ,బికేఎంయు ఏలూరు మండల సమితుల ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహశీల్దార్ కు నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా బికేయంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈసంవత్సరం ఖరీఫ్ పంట ఆలస్యంగా ప్రారంభమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పట్టా ఉన్న రైతులకు మాత్రమే యూరియా విక్రయిస్తుందని కౌలు రైతులకు యూరియా ఇవ్వటం లేదని ఆయన ఆరోపించారు.

నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు రూరల్ మండల కార్యదర్శి పొట్లేలు పెంటయ్య ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు,జిల్లా నాయకులు పికిషోర్, రైతు,వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు బుగ్గల ప్రభాకర్ రావు,మద్దుల వెంకటస్వామి, బోడిగడ్డ ఏసుబాబు, అరిగెల రాజు, గంట వెంకట్రావు, దాసరి రాము, బి యేసు రత్నం, మద్దుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు బహిష్కరించిన శానిటేషన్ వర్కర్లు



ఏలూరు,మేజర్ న్యూస్ : ఏలూరు సర్వజన ఆస్పత్రి,జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో శానిటేషన్ వర్కర్లు విధులు బహిష్కరించారు. ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వీసెస్ సానిటైజేషన్ కాంట్రాక్టర్ 10 నెల నుంచి పిఎఫ్,3 నెలల జీతాల బకాయిలు ఇవ్వట్లేదని ఆందోళన చేశారు. డ్రైనేజీ వ్యవస్థ,శానిటేషన్ పైప్ లైన్లు,వాటర్ పైప్లైన్లు సరిగ్గా లేవని,వాటిని బాగు చేయించాలని పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించు కోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు కే.కృష్ణమాచార్యులు, ఏఐటియుసి జిల్లా సెక్రెటరీ వి.దత్తాత్రేయ. జిల్లా హాస్పిటల్ బ్రాంచ్ నాయకురాలు పి.విజయ,తదితరుల పాల్గొన్నారు.

# మచ్చ లేని మహా మనిషి ఆర్.ఎస్





– సి.పి.యం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం

యలమంచిలి,మేజర్ న్యూస్ : చించినాడ గ్రామ పోరాట యోధుడు కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్. ఎస్.) మచ్చలేని మహా మనిషి అని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం అన్నారు. మండలంలోని చించినాడ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ఆర్ఎస్ ప్రథమ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి జరిగిన అధ్యక్ష త న దిన సభలో బలరాం మాట్లాడుతూ ఉద్యమాలే ఊపిరిగాతన తుది శ్వాస వరకుఆర్. ఎస్ పని చేశారన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ చించినాడ గ్రామంలో ఆర్ఎస్, దళితులకు,పేదల కు కొండంత అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ కమ్యూనిస్టుగా ఖ్యాతి పొందారన్నారు తొలుత ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వల్లి ఆధ్వర్యంలో చైతన్య ప్రసాద్ విప్ల గేయాలు ఆలాపించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్య విప్లవ గేయాలు విశేషంగా అలరించాయి సభలో కేతా గోపాలన్ ,ఆచంట మాజీ శాసనసభ్యులు దిగుపాటి రాజగోపాల్, సీనియర్ నాయకులు కేతా సూర్యారావు తదితరులు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ వర్మ వర్మ,పొగాకు నారాయణ రావు,పూర్ణ, ముచ్చర్ల త్రిమూర్తులు, రుద్రరాజు చినవర్మ పొగాకు నారాయణరావు,పూర్ణ,ముచ్చర్ల త్రిమూర్తులు, సాగర్ తెన్నేటి నాగరాజు, శివాజీ,స్టాలిన్,మురాల రాజేష్ పార్టీ గ్రామ పెద్దలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల భవనాలు పరిశీలించిన మంత్రి పార్థసారథి



ఏలూరు,మేజర్ న్యూస్ : ఏలూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అవసరమైన భవనాలు వైద్య చికిత్స పరికరాలు ఏమి అవసరమో వైద్య శాఖ అధికారాలనుండి మంత్రి కొలుసు పార్థసారథి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సిబ్బంది నియామకాలు భర్తీ చేయటంతో పాటు ప్రభుత్వం ద్వారా లేదా సిఎస్ఆర్ ద్వారా అవసరమైన అన్నిమౌలిక సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కొన్ని భవనాలను వైద్య కళాశాలకు వినియోగించుకోవడం జరుగుతున్నదని, రెండు మూడు నెలల్లో వైద్య కళాశాల భవనాలు పూర్తయితే అవికూడా యధావిధిగా తిరిగి ఆసుపత్రి వినియోగంలోకి వస్తాయన్నారు. మంత్రి వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సావిత్రి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.ఎస్. రాజు, ఎఎంసి చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి ఉన్నారు.

## ఐనపర్రు పంట పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం



ఇరగవరం,మేజర్ న్యూస్ : మండలంలోని ఐనపర్రు పంట పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఇరగవరం సబ్ ఇన్స్పెక్టర్ జనా సతీష్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30నుండి (40) సంవత్సరాలు ఉండవచ్చునని అయన తెలిపారు. నీలం రంగు జీన్స్ ప్యాంటు, ఆరెంజ్ రంగు టీ షర్ట్ ధరించి 5.8'అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఇరగవరం స్టేషన్ హౌస్ అఫిసర్ 9440796681,సర్కిల్ ఇన్స్పెక్టర్ 9440796639 నంబర్లకు తెలియజేయవలసింది తెలియజేసారు.

## ఎమ్మెల్యే రాధాకృష్ణని కారుమూరి విమర్శించడం సిగ్గుచేటు

– కంతేరు సొసైటీ అధ్యక్షులు ఘంటా శ్రీనివాస్



ఇరగవరం,మేజర్ న్యూస్ : మాజీ మంత్రి,వైసిపినేత కారుమూరి నాగేశ్వరరావు ఎరువులు కొరత అంటూ విమర్శించడం తగదని కంతేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు ఘంటా శ్రీనివాస్ అన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కారుమూరి అధికారంలో ఉండగా రైతులను అన్ని విషయాల్లో దగా చేస్తే ఏమిటని ప్రశ్నించిన రైతులను దుర్భసలాడిన ఈయన రైతు సంక్షేమం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ రైతుకైనా ఇబ్బంది ఉందేమో తెలుసుకుని మాట్లాడాలన్నారు. అధికారాన్ని పోగొట్టుకుని ఏమి మాట్లాడాలో అర్థంకాక నోటికి వచ్చినది మాట్లాడుతున్నారని ఎద్దేవా చేసారు. ఎన్నో ఉన్నత పదవులు చేసి కనీసం జ్ఞానం లేకుండా ఎమ్మెల్యే రాధాకృష్ణని విమర్శించడం సిగ్గుచేటన్నారు.కార్యక్రమంలో కంతేరు సర్పంచ్ గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, పాలా ధనసంపతరావు, సొసైటీ డైరెక్టర్ దొంగ మునీశ్వరావు, నీటిసంఘం ఉపాధ్యక్షులు మల్లిడి శ్రీనివాసరావు, ఈటకోట రమేష్, కర్రి నర్సింహారామకృష్ణారెడ్డి, మట్టా శ్రీనివాసరావు, గుడిమెట్ల త్రినాధ్ రెడ్డి, ఇంటి శ్రీనివాసరావు, పొదలాడ మాజీ సర్పంచ్ మల్లుల సత్యనారాయణ, పంపన వెంకటస్వామి, సొసైటీ కార్యదర్శి కె. శ్రీను సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.